క్లుప్తంగా

25న నీలగిరి చెట్ల వేలం

సీతంపేట: స్థానికంగా ఏపీఆర్ గిరిజన బాలుర కళాశాల ఆవరణలో కూలేందుకు సిద్ధంగా ఉన్న 13 నీలగిరి చెట్లను ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు వేలం వేయనున్నట్టు ప్రిన్సిపాల్ పైడి నాగభూషణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాడేవారు ఈ నెల 25న కళాశాలకు మధ్యాహ్నం 3 గంటలకు హాజరు కావాలన్నారు. వేలం దక్కించుకున్నవారు తమ సొంత ఖర్చులతో చెట్లను నరికి వేయించుకోవాలన్నారు.

పశు దాణా కేంద్రం పరిశీలన



పశువుల దాణాను పరిశీలిస్తున్న ఏడీ

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో పశువుల దాణా కేంద్రాన్ని పశు సంవర్ధక శాఖ ఏడీ పి.మాణిక్యాల రావు శుక్రవారం పరిశీలించారు. ప్రైవేటు దాణా కేంద్రాల వార్షిక తనిఖీల్లో భాగంగా సందర్శించామని ఈ సందర్భంగా ఆయన వివరించారు. పాడి రైతులకు అందిస్తున్న పుశు దాణా పరిశీలించి అనుమతులు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆయనతో పాటు గ్రామ పశు వైద్య సహాయకులు వెంకటరమణ ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార ఆవశ్యకత వివరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పాలకొండ రూరల్: తల్లీబిడ్డకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సిమ్మాలమ్మ అన్నారు. మండలంలో భాసూరు, లుంబూరు గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అవసరమైన పోషక విలువలు గల ఆహార పదార్థాలను ప్రభుత్వం సమకూర్చుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, డి.లక్ష్మి, సీహెచ్ రమణమ్మ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు సన్మానం



సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎన్‌జీఓ సంఘ నాయకులు

పాలకొండ: బదిలీపై వెళ్లిన సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌ను ఎన్‌జీఓ సంఘం నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎన్‌జీఓ సంఘం డివిజన్ నాయకులు ఎ.లిల్లీపుష్పనాథం ఆధ్వర్యంలో సంఘ నాయకులు రంగాచారి, ఈశ్వరరావు, రమేష్, రవీంద్ర తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ సబ్ కలెక్టర్‌గా నూరుల్ కమర్ డివిజన్‌లో మంచి సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు.

ఫాగింగ్ మెషిన్ల పంపిణీ



ఫాగింగ్ మెషిన్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆదినారాయణ

సీతంపేట: దోమల నివారణకు 19 పంచాయతీలకు 19 ఫాగింగ్ మెషిన్లను ఎంపీపీ బి.ఆదినారాయణ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం వేళల్లో ఈ మెషిన్ ద్వారా పొగను వదలడం ద్వారా దోమలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సత్యం, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

గరుగుబిల్లి: మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్‌లను శనివారం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీఓ జి.పైడితల్లి శుక్రవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి హాజరై నూతనంగా మంజూరైన పింఛన్లను అందజేస్తారని పేర్కొన్నారు.

మారిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' షెడ్యూల్

గరుగుబిల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష షెడ్యూల్‌లో కాస్త మార్పులు చోటుచేసుకున్నట్లు ఎంపీడీఓ జి.పైడితల్లి తెలిపారు. అక్టోబర్ 3న గొట్టివలస, 4న చినగుడబ, 5న కొత్తూరు, 6న నాగూరు, 10న పెదగుడబ, 11న తోటపల్లి, 12న రావుపల్లి, 18న సంతోషపురం, 19న ఉద్దవోలు, 20న పెద్దూరు, 25న ఉల్లిబద్రలో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆయా గ్రామాల్లోని పాఠశాల ప్రాంగణాలలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

● సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

విజయనగరంలో వైద్య కళాశాల ప్రారంభోత్సవానికి శుక్రవారం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకొండ నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. రూ.29.5 కోట్ల వ్యయంతో చేపట్టిన కిమ్మి - రుషింగి వంతెన పనులు పూర్తయినట్టు ముఖ్యమంత్రికి వివరించారు. - కురుపాం/వీరఘట్టం/పాలకొండ



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, శత్రుచర్ల పరీక్షిత్‌రాజు దంపతులు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పాలకొండ ఎమ్మెల్యే కళావతి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్సీ విక్రాంత్

వాడీవేడిగా మండల సమావేశం

- పథకాల అమలుపై ప్రజాప్రతినిధులకు తెలియజేయాలి
- వైకేపీ సిబ్బంది ఏం చేస్తున్నారో తెలియడం లేదు
- సభ్యుల ధ్వజం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆదినారాయణ

సీతంపేట: ప్రభుత్వ పథకాలు అమలుపై ప్రజాప్రతినిధులకు ఎందుకు తెలియజేయడం లేదని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. సీతంపేట మండల సమావేశం స్థానిక వైటీసీలో ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వైకేపీ పథకం ద్వారా అమలు చేస్తున్న పథకాలు తమకు చెప్పడం లేదని సర్పంచ్‌లు హెచ్.ఆదిలక్ష్మి, సుశీల, సుందరమ్మ, కళావతి తదితరులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. టార్పలిన్‌లు ఎవరికి సరఫరా చేశారో చెప్పాలని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ ద్వారా చేపట్టిన రహదారుల నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయని, బిల్లులు ప్రభుత్వం మంజూరు చేసినా పనులు ఎందుకు చేపట్టడం లేదని ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, దోనుబాయి సర్పంచ్ వెంకునాయుడు నిలదీశారు. దీనికి సంబంధించి కాంట్రాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని ఏఈ సమాధానమిచ్చారు. మ్యుటేషన్ పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వ్యవసాయ శాఖ ద్వారా ఎరువులు సక్రమంగా సరఫరా కావడం లేదని సర్పంచ్ సుశీల, సుందరమ్మ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రాప్ సక్రమంగా జరగడం లేదని, ఆర్‌బీకేల ద్వారా పూర్తి స్థాయిలో అయ్యేలా చూడాలని ఎంపీపీ సూచించారు. ఏడు వేల ఎకరాల్లో జీడి, మామిడి మొక్కలు సరఫరా చేసినట్టు ఏపీఓ సాగర్, బాబురావు తెలిపారు. రహదారులకు ఇరువైపుల రహదారులు క్లియరెన్స్ చేయాలని పలువురు సభ్యులు తెలిపారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రామానగరంతో పాటు ఇతర గ్రామాల్లో పాడైన విద్యుత్ స్తంభాలను మార్పు చేయాలని సర్పంచ్‌లు కోరాగా ఇందుకు ప్రతిపాదనలు పెట్టనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ నీలిమ తెలిపారు. జీజీఎంపీ పనుల్లో భాగంగా ప్రతిపాదించినవి కూడా పూర్తి చేయనున్నామన్నారు. గోకులాలు మండలానికి 23 మంజూరయ్యాయని, ఆసక్తి ఉన్నవారు ముందుకు రావాలని తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తి తెలిపారు. షెడ్ల నిర్మాణానికి స్థలం ఇవ్వాలన్నారు. యూనిట్ ధరలను ప్రభుత్వం భరిస్తుందన్నారు. మండలానికి 410 కొత్త పింఛన్‌లు మంజూరయ్యాయని పంపిణీ ప్రక్రియ చేపడుతున్నట్టు ఎంపీడీఓ కె.సత్యం తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి అందరినీ చైతన్యం చేయాలన్నారు. మండలంలో 4 లక్షల చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్టు ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ తెలిపారు. ఎకరాకు వెయ్యి చేప పిల్లలు పంపిణీ చేస్తామన్నారు. హౌసింగ్ బిల్లులు పెండింగ్ లేకుండా చూడాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ డీఈ కృష్ణకుమార్, ఏఈ నాగభూషన్‌రావు, పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు, పశువైద్యాధికారి ఆర్.శంకరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌరి పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై సర్కారు ప్రత్యేక శ్రద్ధ



జగనన్న ఆరోగ్య సురక్ష కరపత్రాలు అందిస్తున్న సర్పంచ్, ఎంపీడీఓ తదితరులు

పాలకొండ రూరల్: ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రతపై వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపడుతుందని లుంబూరు సర్పంచ్ తిర్లంగి ఉపేంద్రకుమార్ అన్నారు. తమ పంచాయతీ, సచివాలయ పరిధిలో ఎంపీడీఓ జి.ఉమామహేశ్వరితో కలసి ఇంటింటా ప్రచారం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, వలంటీర్లు 15 రోజుల పాటు ప్రత ఇంటిని సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వైద్య సిబ్బంది ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ప్రత్యేక కేష్ సీట్ రూపొందిస్తారన్నారు. అటుపై ప్రత్యేక వైద్య నిపుణులచే వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించటం జరుగుతుందని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించి కరపత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సింహాచలం పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అబ్బాయిరెడ్డి

సీతంపేట: పత్తి పంటలో ప్రకృతి వ్యవసాయంపై పులిపుట్టి పంచాయతీ సుందరయ్యగూడలో వెలుగు అసోషియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ అబ్బాయిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ రైతు పత్తి నాన్ బీటీ వేసినట్టయితే భూమి ఆరోగ్యం బాగుండి రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. యూరియా, డీఏపీ బదులు ఘనజీవ, ద్రవామృతాలు వేయాలన్నారు. పురుగు మందులకు బదులుగా సీమస్త్రం, పంచపత్ర కషాయం ఉపయోగించాలన్నారు. చిరుధాన్యాల పంటలు కూడా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు పి.నాగేశ్వరరావు, వెన్నల, వసంత, పార్వతి, ఉమా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

జీసీఎంఎస్‌లో ఇంటర్నల్ ఆడిట్



డీఆర్‌ఎస్ గొడాంలో రికార్డులు పరిశీలిస్తున్న ఇంటర్నల్ ఆడిటర్ నాయుడు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం జీసీఎంఎస్ బ్రాంచ్ పరిధిలో 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలపై ఇంటర్నల్ ఆడిటర్ ఎస్.ఎం.నాయుడు శుక్రవారం ఆడిట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బ్రాంచ్ కార్యాలయం ఆవరణలో ఉన్న డీఆర్‌ఎస్ గొడాం, గ్యాస్ గొడాం, ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్, పెట్రోల్ బంకును సందర్శించారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. ఆయన వెంట అకౌంటెంట్ ఎస్.గణపతి, ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్ సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు ఉన్నారు.

రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి మార్కెటింగ్ సదుపాయం



రైతులతో మాట్లాడుతున్న నాబార్డు ట్రైనీ బృందం

సీతంపేట: రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఉత్పత్తి చేస్తున్న వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తానని నాబార్డు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజరు తుపాకుల నాగార్జున అన్నారు. మండలంలోని నౌగుడ, గజిలి గ్రామాల్లో ఉన్న రైతు ఉత్పత్తిదారుల కంపెనీతో సభ్యులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసుకోవాలన్నారు. మన్యం సహజ ఎఫ్‌పీవో, మాతోట, వనసహజ ఎఫ్‌పీవో ఏర్పాటు కలక్షన్ సెంటర్లో ఉన్న కొండచీపుర్లు, పసుపు, జీడి, పైనాపిల్‌తో జామ వస్తువు విలువ ఆధారిత అభివృద్ధి ఎలా అనేది రైతులతో మాట్లాడారు. ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ విధానం ద్వారా అభివృద్ధి చేయాలని రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. అనంతరం మేకవలో తయారు చేస్తున్న వెదురు బొమ్మల యూనిట్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కోఆర్డినేటర్లు ఎస్.ఆమోస్, బి.శంకరరావు, నాబార్డు ట్రైనీ టీం సభ్యులు అక్షయ్‌వర్ధన్, వినయ్, ప్రెగ్నల్ గుల్హని తదితరులు పాల్గొన్నారు.

నేడు డిగ్రీ కళాశాలలో వర్క్‌షాప్

పాలకొండ రూరల్: ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛమైన శక్తి– సుస్థిరమైన భవిష్యత్తు అనే అంశంపై సేషనల్ వన్డే వర్క్‌షాప్ శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్యామ్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కళాశాల ఐక్యూ ఏసీ నేతృత్వంలో మానవాళి మనుగడకు ఓజోన్ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ప్రముఖ ఆచార్యులు, శాస్త్రవేత్తల పర్యవేక్షణలో వర్క్‌షాప్, పోస్టర్ మేకింగ్, నినాదాలు రాయటంపై విద్యార్థులకు పీపీటీ ప్రజెంటేషన్, క్విజ్ పోటీలు చేపడతామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో ఇంటింటా సర్వే



పి.ఆమిటిలో ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఈ నెల 30 నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కోసం గుమ్మలక్ష్మీపురం మండలంలో శుక్రవారం నుంచి ఇంటింటా సర్వేను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ ఏపీడీ సత్యంనాయుడు, ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు ఇంటింటికీ వెళ్లి జబ్బులు ఉన్న దీర్ఘకాలిక, అంటు వ్యాధులు ఉన్న వారి వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. ఈ నెల 30 నుంచి ఆయా గ్రామాల్లో నిర్వహించే ఆరోగ్య సురక్ష శిబిరాలకు తరలించి ఉచిత వైద్య సేవలు అందించనున్నట్టు పేర్కొన్నారు. సర్వేను పక్కాగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

బంగారు భవితకు క్రీడలు దోహదం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు

పాలకొండ రూరల్: చదువుతో పాటు ఉజ్వల భవిష్యత్తును పొందేందుకు క్రీడలు దోహదపడతాయని మండలంలోని ఎం.సింగుపురం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.సంగంనాయుడు అన్నారు. తమ పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అండర్ 14, 17 పాఠశాల స్థాయి క్రీడా సమాఖ్య ఎంపిక పోటీల ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో 40 పాఠశాలకు చెందిన 500ల మంది క్రీడాకారిణులు 800ల మీటర్ల రన్నింగ్, ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, జావిలన్‌త్రో, లాంగ్ జంప్ తదితర క్రీడల్లో తలపడ్డారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన క్రీడాకారులు ఈ నెల 25న జరగనున్న జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొననున్నారు. అంతకు ముందు పోటీలను మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు ప్రారంభించారు. గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎస్ఐ షన్ముఖరావు

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులంతా క్రమ శిక్షణను అలవర్చుకోవాలని ఎల్విన్‌పేట ఎస్ఐ ఎస్.షన్ముఖరావు అన్నారు. భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కాలేజ్ (బాయ్స్)ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదుల్లోని విద్యార్థుల వద్దకు వెళ్లి సూచనలు చేశారు. ఇంటర్మీడియెట్, డిగ్రీ చదువుకునే ప్రస్తుత స్థాయిలోనే సరైన మార్గాన్ని నిర్దేశించుకొని ఉన్నతమైన లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఈ స్థాయిలో ఏ చిన్న పొరపాటు చేసిన జీవితాంతం బాధపడాల్సి ఉంటుందన్నారు. చెడు వ్యసనాలు జోలికి పోకుండా తల్లిదండ్రుల చిరకాల కాంక్షను నెరవేర్చేలా చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచి చదువులో ఉన్నతంగా రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ యుగంధర్, వైశ్య సంఘం అధ్యక్షుడు గుడ్ల హరిప్రసాద్ ఉన్నారు.

రైతు సహకార సంఘాలతో ప్రయోజనం




సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ సంజీవరావు

భామిని: గిరిజన రైతులు సహాయ సహకార సంఘాలుగా ఏర్పడి పని చేస్తే ఉమ్మడిగా మంచి ఫలితాలు సాధించవచ్చని వెలుగు అసోసియేషన్ డైరెక్టర్ బి.సంజీవరావు, ఉపాధి హామీ ఏపీఓ ఇ.తులసీదాస్ అన్నారు.

మండలం బొడ్డగూడలో అడవితల్లి సహాయ సహకార సంఘ వార్షికోత్సవంలో శుక్రవారం మాట్లాడారు. ఉద్యానవన శాఖ హెచ్‌టీఓ పేడాడ జయశ్రీ గిరిజన మండలాల్లో పండ్ల తోటల అభివృద్ధికి తీసుకొంటున్న చర్యలు వివరించారు. రెండు మండలాల్లో 9 హెక్టార్లలో జీడి, మామిడి, జామ మొక్కలు నాటించామన్నారు. లివిరి, సతివాడ గ్రామాల పరిధిలో వాస్సన్ సంస్థ సహకారంతో కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు ప్రతిపాదించామని వివరించారు. కార్యక్రమంలో వెలుగు, వాస్సన్ సంస్థ ప్రతినిధులు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ

కురుపాం: సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం అని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వి.వి.శివరామప్ప ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పంచాయతీ అధికారి మాట్లాడుతూ అర్హత గల ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హత గల లబ్ధిదారులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గార్ల సుజాత, కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు, సీఎస్‌డీటీ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● కొత్త పింఛన్ల పంపిణీ



పాలకొండ రూరల్: అట్టలిలో పింఛన్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పాలకొండ: కొంగాపురం గ్రామంలో కొత్త పింఛన్ల పంపిణీ

ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను పలుచోట్ల పండుగ వాతావరణంలో పంపిణీ చేస్తున్నారు. పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులు సంబరాలు చేసుకుంటున్నారు. తమకు పింఛన్లు మంజూరు చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని చెబుతున్నారు. - సాక్షి నెట్‌వర్క్

భూ సమస్యల పరిష్కారానికే సర్వే



ఘనసరలో భూసర్వేకు భూమి పూజ

భామిని: భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – శాశ్వత భూ సర్వేతో సాధ్యపడుతుందని డిప్యూటీ తహసీల్దార్ రమేష్ కుమార్ అన్నారు. మండలంలోని పెద్ద రెవెన్యూ గ్రూప్‌గా గుర్తింపు పొందిన ఘనసరలో భూ సర్వే పనుల ప్రారంభానికి శుక్రవారం భూమి పూజ మాట్లాడారు. వందేళ్ల తరువాత జరుగుతున్న భూ సర్వేతో రైతుల భూ సమస్యలు సంపూర్ణంగా పరిష్కారమవుతాయన్నారు. మండల సర్వేయర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో రైతుల భూ సర్వే నంబర్లు వివరాలు చదివి వినిపించారు. వైఎస్సార్‌సీపీ కార్యదర్శి కిల్లారి ఫల్గుణ రావు, వీఆర్ఓ సీహెచ్ భారతి, సహాయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.